# ఎప్పుడు ఎంత వర్షం

**చైత్రం:** చైత్రం: ఈ నెలలో వేడిగాలులు అధికంగా వీస్తాయి. రేవతి కార్తె రాకతో వాతావరణం కొంత చల్లబడుతుంది. ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడతాయి. అశ్విని కార్తెలో ఎండలు ఎక్కువగా ఉంటాయి.

**వైశాఖం:** ఈ నెలలో భరణి, కృత్తిక కార్తెల ప్రభావం ఉంటుంది. ఈ కార్తెల ప్రవేశ సమయాలు అంతంత మాత్రంగానే ఉండటంతో ఎండల ప్రభావం అధికంగా ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురుస్తాయి. రుతుపవనాల ప్రభావం సంతృప్తికరంగా ఉంటుంది.

**జ్యేష్ఠం:** ఈ మాసం ప్రారంభంలో రోహిణి కార్తె ప్రభావం ఉంటుంది. వర్షాలు కురిసినప్పటికీ ఎండ కూడా ఎక్కువగానే ఉంటుంది. రుతుపవనాలు విస్తరిస్తాయి. మృగశిర కార్తె రాకతో మేఘాడంబరం మొదలవుతుంది. అటవీ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయి.

**ఆషాఢం:** ఈ నెలలో గ్రహస్థితి ప్రశస్తంగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. ఆరుద్ర కార్తెలో మిశ్రమ వాతావరణం ఉంటుంది. పునర్వసు కార్తెలో అనుకూల వానలు పడతాయి. రుతుపవనాల ప్రభావం అనుకూలంగా ఉంది.

**అధిక శ్రావణం:** పుష్యమి కార్తె సమయం బలంగా ఉండటంతో, రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయి. పంటలకు అనుకూలంగా వర్షపాతం నమోదవుతుంది. నదీనదాలు ఉప్పొంగి ప్రవహిస్తాయి. ఆశ్లేష కార్తెలో వాతావరణంలో వేడి పెరుగుతుంది. కొన్నిప్రాంతాల్లో ఎడతెరిపిలేని వర్షాలు ఉండవచ్చు.

**నిజ శ్రావణం:** ఈ నెలలో కార్తెల ప్రవేశ సమయాలు అనుకూలంగా ఉన్నాయి. పంటలకు అనువైన వర్షాలు ఉంటాయి. నదీతీరాలు, కొండ ప్రాంతాల్లో వర్షపాతం ఎక్కువగా నమోదవుతుంది. నెల మధ్యలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పటికీ, మాసాంతంలో సమృద్ధిగా వానలు పడతాయి.

**భాద్రపదం:** ఈ మాసంలో కార్తెల ప్రభావం, గ్రహస్థితి అనుకూలంగా ఉండటం వల్ల సస్యానుకూల వర్షాలు పడతాయి. కొన్ని ప్రాంతాల్లో కుంభవృష్టి కురుస్తుంది. మాసం మధ్యలో తుఫాన్‌లు ఏర్పడవచ్చు. మాసాంతంలోనూ భారీ వర్షాలు ఉంటాయి.

**ఆశ్వయుజం:** ఈ మాసంలో గ్రహస్థితి, కార్తెల ప్రభావం సామాన్యంగా ఉంది. చిరుజల్లులు కురుస్తాయి. మేఘాడంబరం ఉంటుంది. వర్షాలు మాత్రం ఆశించిన స్థాయిలో కురవకపోవచ్చు. మాసాంతంలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

**కార్తికం:** ఈ మాసంలో అనూరాధ కార్తె ప్రవేశ సమయం బాగుండటంతో అనుకూల వర్షాలు ఉంటాయి. పంటలకు అనుకూల వాతావరణం ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది.

**మార్గశిరం:** ఈ మాసంలో కార్తెల ప్రభావం, గ్రహస్థితి అనుకూలంగా ఉంది. తేమతో కూడిన గాలులు వీచే అవకాశం ఉంది. చలి తీవ్రత అధికమవుతుంది. మాసాంతంలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

**పుష్యం:** ఈ నెలలో చలిగాలులు ఎక్కువగా ఉంటాయి. మాసం మధ్యలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి వేళల్లో చలి ప్రభావం కొనసాగుతుంది.

**మాఘం:** ఈ మాసంలో వాతావరణం సమశీతోష్ణంగా ఉంటుంది. ఎండల ప్రభావం క్రమంగా పెరుగుతుంది. వ్యవసాయానికి అనుకూల వాతావరణం ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికమవుతాయి.

**ఫాల్గుణం:** ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతాయి. వేడి గాలులు పెరుగుతాయి. కొన్నిచోట్ల గాలివాన బీభత్సం సృష్టించవచ్చు. పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది.

## మేష సంక్రమణం (14/4/2023)

**శ్రీ శోభకృత్ నామ సంవత్సరం చైత్ర కృష్ణ నవమి శుక్రవారం తేది 14-4-2023 పగలు 2-58 గంటలకు శ్రవణా నక్షత్రం రెండో పాదం మకర రాశి ప్రయుక్త సింహ లగ్నంలో సూర్యుడు మేషరాశిలోకి ప్రవేశిస్తున్నాడు.**

**ఫలితం:** కృష్ణ నవమి: కలహం, శుక్రవారం: పంటల సమృద్ధి, శ్రవణా నక్షత్రం: శుభకరం, సాధ్యనామ యోగం: పాడిపంటల వృద్ధి, గరజి కరణం: కొన్ని ప్రాంతాల్లో వర్షాభావం, అపరాహ్ణ కాలం: ప్రజాపీడ, సింహం లగ్నం: వర్షాభావం, పూర్వాషాఢాది నాల్గో మండలం: శుభప్రదం,

**సాముదాయిక ఫలితం:** ఇరుగు పొరుగు దేశాలతో యుద్ధ వాతావరణం ఉంటుంది. దేశంలోఅనుకూల వర్షాలతో పాడిపంటల సమృద్ధి ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ప్రజల మధ్య అంతఃకలహాలు ఏర్పడతాయి. మొత్తం మీద దేశంలో అనుకూల వాతావరణం ఉంటుంది.

## వర్షం – ఆఢకం ఫలం:

రాజు బుధుడు కావడం వల్ల ఈ ఏడాది మూడు తూముల వర్షం, నాలుగు తూముల వాయువు ఉంటుంది. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. ఆఢకం దేవమానంతో 70 యోజనాల వెడల్పు, 100 యోజనాల ఎత్తు కలిగి ఉంది. వర్షపాతం సముద్రంలో 10 భాగాలు, పర్వతాల్లో 6 భాగాలు, భూమి మీద 4 భాగాలు కురుస్తుంది.

ఈ సంవత్సరం ఆఢకం వేశ్య హస్తగతమై ఉన్నది. సంవత్సరాది నుంచి అంటే 22-03-2023 నుంచి 28-04-2023 వరకు బాలవేశ్య హస్తగతమై ఉండటం వల్ల యుద్ధ వాతావరణం ఉంటుంది. తదాది 22-08-2023 వరకు యవ్వన వేశ్య హస్తగతమై ఉండటం వల్ల అనుకూల వర్షాలతో పంటలు బాగా పండుతాయి. తదాది 11-01-2024 వరకు బాలవేశ్య హస్తమందు, తదాది సంవత్సరాంతం వరకు యవ్వన వేశ్య హస్తగతమై ఉన్నది. మొత్తం మీద ఆఢక ఫలం శుభప్రదంగా ఉన్నది.

## గంగానది పుష్కరాలు



స్వస్తి శ్రీ శోభకృత్ నామ సంవత్సరం వైశాఖ శుక్ల పాడ్యమి తేది 21-4-2023 శుక్రవారం తెల్లవారితే శనివారం అనగా రా.తె. 5-09 గంటలకు దేవ గురువు బృహస్పతి మేషరాశిలోకి ప్రవేశిస్తున్నాడు. ఈ క్రమంలో ఏప్రిల్ 22 నుంచి సార్ధ త్రికోటి సహిత గంగానది పుష్కరాలు ప్రారంభం అవుతాయి. పన్నెండు రోజులు కొనసాగి మే 3వ తేదీతో ముగుస్తాయి. పుష్కరాల సమయంలో పితృదేవతల ప్రీత్యర్థం స్నాన, దాన, తర్పణ, పిండ ప్రదానాలు చేయడం పుణ్యప్రదం.